# గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట..

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం: బీఆర్ఎస్ నాయకుల విమర్శ

**భీంగల్ , సెప్టెంబర్ 15,(నవగీతం)** గిరిజనుల సంక్షేమం,అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీఆర్ఎస్ గిరిజన నాయకులు పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, వ్యవసాయం,ఉపాధి, సంక్షేమ రంగాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.రాష్ట్రంలోని 1,682 ఎస్టీ నివాసాల్లో రహదారుల నిర్మాణానికి రూ.1,276 కోట్లు, 92 గురుకులాల ఏర్పాటుకు రూ.292 కోట్లు,మురుగు నీటి పారుదల వ్యవస్థల కోసం రూ.133 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. 237 మంది పేద గిరిజన విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.33.49 కోట్లు అందించారని తెలిపారు.2.28 లక్షల మంది గిరిజన మహిళలకు కేసీఆర్ కిట్ ద్వారా రూ.151 కోట్లు, 1,424 మంది గిరిజన యువతకు వాహనాల ద్వారా ఉపాధి కల్పించేందుకు రూ.101.50 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మేడారం, నాగోబా, జంగుబాయి తదితర గిరిజన జాతరలకు రూ.354 కోట్లు, సమ్మక్క--సారలమ్మ మ్యూజియం ఏర్పాటుకు రూ.22.53 కోట్లు, ఆదివాసీ, బంజారా ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుబంధు పథకం ద్వారా 8,23,780 మంది గిరిజన రైతులకు రూ.7,354 కోట్లు, రైతుబీమా ద్వారా గిరిజన రైతుల కుటుంబాలకు రూ.611 కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. గిరిజన రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.221 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.గిరిజనులకు పింఛన్ల రూపంలో 3,75,316 మందికి రూ.4,286 కోట్లు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా 1,36,730 మంది గిరిజన ఆడబిడ్డలకు రూ.1,126.61 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. గిరిజన గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ.1,837.08 కోట్లు, నూతన గిరిజన గ్రామ పంచాయతీల నిర్మాణానికి రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.



**ఎస్టీ సబ్‌ప్లాన్‌కు భారీగా నిధులు..**

2022--23 ఆర్థిక సంవత్సరంలో గిరిజనుల కోసం ఎస్డీఎఫ్ కింద రూ.13,412.63 కోట్లు కేటాయించగా, 2023--24లో రూ.15,232.62 కోట్లకు పెంచినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.గిరి వికాస్ పథకం ద్వారా 19,698 మంది గిరిజన రైతులకు చెందిన 56,613 ఎకరాలను సాగులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్, మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందించడంతో పాటు గిరిజన తండాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక వసతుల కోసం టీఎస్ ఎస్డీఎఫ్ కింద రూ.1,000 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు పేర్కొన్నారు.గిరిజన యువతలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్,ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారని, మహిళలకు డబ్ల్యూఈ ద్వారా స్వయం ఉపాధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోడు భూములకు పెద్ద ఎత్తున పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు

**కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి గిరిజనులను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మూడు గిరిజన కార్పొరేషన్లు,ఐదు ఐటీడీఏలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజన విద్యార్థులు, గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతి మండలానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేదని,ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనూ స్పష్టమైన చర్యలు చేపట్టకుండా మాటలకే పరిమితమైందని విమర్శించారు.గిరిజనుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాదావత్ శర్మ నాయక్, మాలోత్ నరహరి నాయక్,సర్పంచ్ లకవత్ శేఖర్, ప్రకాష్ నాయక్, తిరుపతి నాయక్, తుక్కాజీ నాయక్, లింగం నాయక్, సంతోష్ నాయక్, శేఖర్ నాయక్, రాందాస్ నాయక్, ఎంజీ నాయక్,నరేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, అనిల్ నాయక్, భాస్కర్ నాయక్, బాబులాల్ నాయక్, రవి నాయక్, పరమేశ్వర్ నాయక్, రాములు నాయక్, సీతారాం నాయక్, గంగాధర్ నాయక్, నాగేష్ నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో కుళ్ళిన కూరగాయలతో వంటలు.

## ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీపై మెస్ ఇన్ ఛార్జ్, ప్రిన్సిపాల్ దుర్భాషలు.

**ములుగు, సెప్టెంబర్15,(నవగీతం).** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని కాంక్షిస్తూ కోట్లు ఖర్చు చేస్తుంటే కొందరు మాత్రం వాటిని జేబుల్లోకి ఎలా మలుపుకోవాలని చూస్తున్నారు.అటువంటి సంఘటన ములుగు జిల్లా మల్లంపల్లి లోని ఏటూరు నాగారం టిజిఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ జూనియర్ కళాశాల (బాలురు) గురుకుల పాఠశాలలో జరిగింది. విద్యార్థులకు కుళ్ళిపోయిన కూరగాయలతో భోజనం పెడుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పాఠశాల పేరెంట్స్ కమిటీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం రోజున పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్షం రాజ్ కుమార్ పాఠశాలలోని వంటగదిని, మెస్ రూమ్‌ను సడన్ గా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో తీవ్రమైన నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. కుళ్ళిన కూరగాయలతో వంటలు.వంట గదిలో పూర్తిగా కుళ్ళిపోయిన క్యాబేజీ, చిక్కుడుకాయలు, టమాటాలు లభించాయి. అంతటి నిరుపయోగమైన చిక్కుడుకాయలను విద్యార్థుల చేతే పొట్టు తీయిస్తూ, అవే కూరగాయలతో వంటలు చేస్తుండటాన్ని కమిటీ చైర్మన్ ప్రత్యక్షంగా చూసి షాక్ అయ్యారు. ఈ



అక్రమాలను ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ పై మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ తీవ్ర దురహంకారంతో విరుచుకుపడ్డారు. "మా ఇష్టం... ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, స్కూల్ తనిఖీ చేసే అధికారం మీకెవరిచ్చారు? పేరెంట్స్ కమిటీ అయినా గేటు బయటే ఉండాలి" అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. అదేవిధంగా,పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన పాఠశాల ప్రిన్సిపాల్ కూడా మెస్ ఇన్‌ఛార్జ్‌కే మద్దతు ఇస్తూ "మీరు తనిఖీ చేయడం కరెక్ట్ కాదు, అడగడానికి మీరెవరు?" అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం విచారకరమని అన్నారు. పాఠశాలలో పిల్లలకు కనీసం తాగడానికి మంచినీటి సదుపాయం లేకపోవడమే కాకుండా, మరుగుదొడ్లు లేక విద్యార్థులు బకెట్లతో నీళ్ళు



పట్టుకుని అడవి బాట పడుతున్నారు. పేద కుటుంబాల పిల్లల ఆరోగ్యం మరియు భవిష్యత్తును నాశనం చేస్తూ, కనీస సదుపాయాలు కల్పించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ ను, ఆయనకు సహకరిస్తున్న ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని జోనల్ ఆఫీసర్ మరియు ములుగు జిల్లా సంక్షేమ అధికారి ని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. లేని పక్షంలో తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# భద్రాచలం గోదావరి నదిపై మూడో వంతెన.

## రైల్వే లైన్ మంజూరు కై కృతజ్ఞతగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం.

**ములుగు,సెప్టెంబర్15,(నవగీతం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రాంత ప్రజల చిరకాల రైల్వే కలను సాకారం చేసే దిశగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పాండురంగాపురం--భద్రాచలం--మల్కాన్‌గిరి 173.61 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్‌ను మంజూరు చేయడాన్నిస్వాగతిస్తూ భద్రాచలంలో బీజేపీ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.
అంతకుముందు అంబేద్కర్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ,భద్రాచలం ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న రైల్వే కనెక్టివిటీ కోసం గతంలో పాండురంగాపురం--సారపాక వరకు సుమారు 8 కి.మీ. రైల్వే లైన్‌ను కోరుకున్నామని, అయితే మోదీ ప్రభుత్వం పాండురంగాపురం



నుంచి భద్రాచలం మీదుగా మల్కాన్‌గిరి వరకు 2864 కోట్లతో 2031లోగా పూర్తి చేసేలా 173.61 కి.మీ. రైల్వే లైన్‌ను మంజూరు చేయడం గొప్ప విషయమని అన్నారు.
ఈ ప్రాజెక్టులో భద్రాచలం వద్ద గోదావరిపై మూడో రైల్వే వంతెన నిర్మాణం జరగడం ద్వారా భద్రాచలం నేరుగా రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం కానుందని తెలిపారు. ఇది దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పెంచడంతో పాటు, ఏజెన్సీ గిరిజన ప్రాంతాల విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు.ఇప్పటికే మంజూరైన ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా రైల్వే శాఖకు భూమిని అప్పగించాలని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, కందుల రాంకిషోర్, పసుమర్తి సతీష్, అట్లూరి రఘురామ్, ములిశెట్టి రాంమోహన్ రావు, ముత్యాల శ్రీనివాస్, కంద్రపు త్రినాథ్ రెడ్డి, నూప రమేష్, రామెళ్ళ రాజశేఖర్, పెద్ది జగపతి బాబు, నిడదవోలు నాగబాబు, తాటిపాముల ఐలయ్య, ముత్యాల చంద్రశేఖర్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, ములిశెట్టి నిఖిల్, షేర్ శ్రీను, జీవా, మాలోత్ సాయి, కారం చిన్నయ్య, కోర్స గంగరాజు, సోలం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లకు సన్మానం

**రాయికల్ , సెప్టెంబర్ 15,(నవగీతం)** రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సందర్భంగా పట్టణంలోని ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వాసం ప్రసాద్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తమ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యంతో సమాజ ప్రగతికి ఇంజనీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఇంజనీర్లు నిర్మాణ రంగం, సాంకేతిక రంగం, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ఆధునిక సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇంజనీర్ల సేవలను గుర్తించి వారిని సన్మానించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ ట్రెజరర్ సుధా వేణి మురళి గౌడ్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, మచ్చ శేఖర్, వాసం స్వామి, ఆడెపు రామ్ ప్రసాద్, సామల సత్యనారాయణ, పులి రమేష్, ఇంజనీర్ శేఖర్, జీవన్, రాజు, నరేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంజనీర్లకు లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానం చేసి ఇంజనీర్స్ డే శు భాకాంక్షలు తెలిపారు.




## సీనియర్ ఛాయాచిత్ర కారుడు శ్రీనివాసుకు ఛాయాచిత్ర సేవా పురస్కారం



**మల్లాపూర్,సెప్టెంబర్15,(నవగీతం)** మల్లాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ ఛాయాచిత్రకారుడు దురిశెట్టి శ్రీనివాసుకు 'నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఛాయాచిత్ర సేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. మంగళవారం ట్రస్ట్ బృందం శ్రీనివాసును ఇంటర్వ్యూ చేసి, ఫోటోగ్రఫీ రంగంలో ఆయన అందించిన సేవలను గుర్తించింది. ఎన్నో ఏళ్లుగా ఛాయాచిత్రకారుడిగా సేవలందిస్తున్న శ్రీనివాసు ప్రస్తుతం నిరుపేద కుటుంబ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. ఆయన పరిస్థితులను తెలుసుకున్న ట్రస్ట్ ప్రతి నెల రూ.1,116 ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ.. తనలాంటి సీనియర్ ఫోటోగ్రాఫర్లను గుర్తించి వారి స్థితిగతులను తెలుసుకుని ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారంతో సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి నెల ఆర్థిక సహాయం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ అధినేత కమ్మరి రామకృష్ణాచారి, బృంద సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ ఛాయాచిత్రకారుల సంక్షేమానికి ట్రస్ట్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఛాయా చిత్రకారులు మండలోజు శ్రీనివాసచారి, కమ్మరి రామకృష్ణ చారి, ఇరుకుల్ల వీరేశం తదితరులు ఉన్నారు.

## పాత దాంరాజుపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం






**మల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవగీతం):** మల్లాపూర్ మండలంలోని పాత దాంరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఖానాపూర్ సింధుశ్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొప్పుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఇమ్రాన్ పాషా, ఎం.డి. ఆదిత్య ఐ కేర్ డాక్టర్ సన్నిత్ కుమార్ వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని సింధుశ్రీ హాస్పిటల్స్ వైద్యులతో పాటు గ్రామ సర్పంచ్ రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి, ఉపసర్పంచ్ ఇప్పపెల్లి గణేష్ ప్రారంభించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత మెగా హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీ నరసయ్య, బీజేవైఎం జిల్లా నాయకులు పందిరి నాగరాజు, స్థానిక నాయకులు అయ్యోరి దశరథం, కొత్తూరు గంగారెడ్డి, మామిడాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



**మల్లాపూర్,సెప్టెంబర్15,(నవగీతం):** మల్లాపూర్ మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ చేతుల మీదుగా మండలంలోని 20 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు చిట్యాల లక్ష్మణ్,తోట శ్రీనివాస్,జెల్ల రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లిసరోజన ఆదిరెడ్డి, వైస్ ఎంపీపీ గౌరునాగేష్, మాజీ మార్కెట్ చైర్మన్ కాదుర్కా నర్సయ్య, వైస్ చైర్మన్ శరత్ గౌడ్, నాయకులు బైరి రవికుమార్ యాదవ్, నాయకులు రమేష్, సచిన్, లక్ష్మణ్, జైపాల్ రెడ్డి, నరేష్ యాదవ్, ప్రసాద్, రాజు, సురేష్, మహేందర్ తదితర నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

6 **జనరల్**

**నవగీతం** తెలుగు దినపత్రిక

బుధవారం
16 సెప్టెంబర్ 2026

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం



**రాయికల్, సెప్టెంబర్ 15,(నవగీతం)** రాయికల్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు లో ఘనంగా నిర్వహించారు. విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి మరియు పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసిన 28 మంది ఉపాధ్యాయులను, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ లను సత్కరించి పురస్కారాలు సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున యంపిడివో బి.చిరంజీవి, యం.పి.ఓ.సుష్మ,మున్సిపల్ కౌన్సిలర్ పురె శ్రీధర్ నాయకులు తురగా శ్రీధర్ యంఇఓ శ్రీపతి రాఘవులు హాజరయ్యారు.రాయికల్ మండల విద్యారంగంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను వారు అభినందించారు. మండలాన్ని విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయుల నిబద్ధత, కృషి, సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఉప వైద్యాధికారి డా.ఎన్.శ్రీనివాస్



**రాయికల్, సెప్టెంబర్ 15,(నవగీతం)** రాయికల్ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ .శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వద్దేలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.. పారిశుద్ధ్యం, క్లోరినేషన్ కార్యక్రమాలపై పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యవేక్షించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్, సర్పంచ్ బండారి మానస, సిబ్బంది తదితరులు ఉన్నారు

## బడా భీంగల్ లో కాంగ్రెస్ హామీలపై బాకీ కార్డుల పంపిణీ..



**భీంగల్ , సెప్టెంబర్ 15,(నవగీతం)** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో కూడిన 'బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు దాటుతున్నప్పటికీ పలు హామీలు, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేసి ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 13 వసంతాలు పూర్తి చేసుకున్న "శ్రీ రామ యూత్"

**కామేపల్లి, సెప్టెంబర్ 15(నవగీతం):** కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలోని రామాలయం సెంటర్లో గత 13 సంవత్సరాల క్రితం శ్రీ రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వినాయక చవితి వేడుకలను కన్నులపండువగా నిర్వహించడం జరుగుతుంది నియమం నిష్టలతో ఈ మహా క్రతువు నిర్వహించడంతో ప్రతి సంవత్సరం గ్రామం లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటుంది వేదిక నిర్మాణం దగ్గర నుంచి నిమజ్జనం వరకు ప్రతి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు, ప్రతి రోజూ దూప దీప నైవేద్యాలు సమర్పించి ఆ విఘ్నేశ్వరుని కృపా కటాక్షాలు సిద్ధించాలని ప్రత్యేక పూజలు, నిర్వహిస్తున్నారు " మహా అన్న దాన" కార్యక్రమం ప్రసాదం పంపిణీకి చేయడం వంటి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు,, గత 12 సంవత్సరాలుగా దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తు 13 వసంతంలోకీ అడుగు పెడుతున్న శుభ సందర్భంలో శ్రీ రామ యూత్ సభ్యులు సంతోషంతో వేడుకలు నిర్వహించారు.

## అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**కరీంనగర్, సెప్టెంబర్ 15,నవగీతం)** భారతదేశ ప్రముఖ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-ఏ, కరీంనగర్ ఆధ్వర్యంలో స్థానిక సన్మానించారు.వాసుదేవా హాస్పిటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, అల్లాడి ఆనంద్ కుమార్,శ్రీరాముల శ్రీనివాస్లను శాలువా, మెమంటో మరియు వాచ్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా హైడ్రాలిక్ డ్యామ్ గేట్ల రూపకల్పనలో ఆయన ప్రతిభను, హైదరాబాద్‌లో మూసీ నది వరదల నివారణకు ఆయన అందించిన ఇంజనీరింగ్ పరిష్కారాలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 సాగర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ పీఆర్ ఓ పుల్లాల శ్యామ్ ఎల్ ఐ సి ఎగ్జిక్యూటివ్ రత్నమాల, సిద్దిపేట డి ఎస్ పి సదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఘన సన్మానం.


### గ్రామ పంచాయితీ పాలకవర్గం



**భీంగల్, సెప్టెంబర్ 15,(నవగీతం)** భీంగల్ మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో బడా భీంగల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని వార్డు సభ్యులు కొనియాడారు. కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖో-ఖో తదితర క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించిన 65 మంది బాలబాలికలను మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం (వార్డు సభ్యులు) శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాంద్రా సుమన్, దాస్ అరుణ్, నవీన్, శ్రీకాంత్, రాజ్ కుమార్, మేఘన, మానస, గీత, లత, సత్తెవ్వలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి.


### ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



**ములుగు, సెప్టెంబర్ 15,(నవగీతం)** ములుగు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులనుఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ అనేది ప్రజా సేవా సంస్థ అని, దీని ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగాలని అన్నారు. అదేవిధంగా అక్టోబర్ 4న జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ఎన్నికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితా తయారీ అత్యంత కీలకమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాతో పాటు ఎన్నికల ప్రకటన విడుదల చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోజు రోజుకు మృత్యువాత పడుతున్న పశువులు.

### సరైన వైద్యం అందకనే అంటున్న గ్రామస్తులు.



**నూగూరు వెంకటాపురం. సెప్టెంబర్ 15,(నవగీతం)**నూగూరు వెంకటాపురం మండలంలోని రాచపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నాలుగు గ్రామాలున్నాయి , రాచపల్లి, మల్లాపురం, ముట్లగూడెం, కర్రీవాణిగుప్ప. ఈ గ్రామాల్లోని పశువుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.ఈ గ్రామాల్లోని మేకలు, గొర్రెలు, ఆవులకు సోకిన వ్యాధులకు సరైన టీకాలు, మందులు అందక వరుసగా చనిపోతున్నాయి.సొర్లం రాంమూర్తి, సొర్లం ధారయ్య, కంతి ప్రసాద్, కుర్సం బాలయ్య, కుర్సం ఎడమయ్య, ఇర్ప ముత్తయ్య, రేగ రామక్క, ఇర్ప కన్నయ్య, మడకం శాంతమ్మ, పండా సత్యం, కుర్సం నాగయ్య, కుర్సం శంకర్, పండా శ్రీను, మడకం రామయ్య, శ్యామల ముత్తయ్య వంటి పాడి రైతులుకన్నీరుమున్నీరవుతున్నారు.గ్రామస్తులు పశువైద్యుని వద్దకు వెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. "ఫోన్ చేసినా రావడం లేదు, వచ్చినా మందులు లేవని చెప్పి వెళ్లిపోతున్నారు" అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలోని వ్యాధులతో మేకలు, గొర్రెలు పిట్టల్లా రాలిపోతున్నాయి. ఒక పశువు చనిపోతే రూ.20 వేల నుండి 50 వేల వరకు నష్టం. మా బ్రతుకులు పశువుల మీద ఆధారపడి ఉన్నాయనీ డాక్టర్ నిర్లక్ష్యం వల్ల మేము అప్పులపాలవుతున్నాం అని రైతులు కన్నీరు పెడుతున్నారు.వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రాచపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అన్ని పశువులకు ఉచితంగా టీకాలు, మందులు అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైన విస్డం హై స్కూల్ విద్యార్థులు



**రాయికల్, సెప్టెంబర్ 15,(నవగీతం)** రాయికల్ పట్టణంలోని స్థానిక బాయ్స్ హై స్కూల్ మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీలలో విస్డం హై స్కూల్ కు చెందిన విద్యార్థులు కబడ్డీ అండర్ 17 బాల బాలికల విభాగంలో మారంపల్లి శ్రేయాస్, పంచతి విష్ణుప్రియ, మధు వర్షిని, వాలీబాల్ అండర్ 17 బాల బాలికల విభాగంలో కాసారపు మహీధర్, ఐలవేణి మహిత, మూల వరునిక, అండర్ 14 వాలీబాల్ బాలబాలికల విభాగంలో ఎద్దండి రూప్యరెడ్డి, గోపు జాశ్విని, ముక్కెర సిద్దు, అండర్ 14 కబడ్డీ లో ధనరేకుల హర్షిత్, అండర్ 17 అండర్ 14 ఖోఖో లో మేకల రిషిత్ యాదవ్, పులవేణి మహిధర్, బోడ మిధున, అథ్లెటిక్స్ లో అండర్ 17 బాయ్స్ డిస్కస్ త్రో కాసారపు మహీధర్ ప్రథమ స్థానం, అండర్ 14 గర్ల్స్ విభాగంలో చిదుమళ్ళ శాన్విక 100, 200,హై జంప్ లో మొదటి స్థానం, బోడ మిధున లాంగ్ జంప్ ఒ 200మీ ద్వితీయ స్థానం, 14 బాయ్స్ డిస్కస్ త్రో లో ముక్కెర సిద్దు ద్వితీయ స్థానం, అండర్ 17 బాయ్స్ క్రికెట్ విభాగంలో కాసారపు మహీధర్, మేకల రిషిత్ యాదవ్, బోరకుంట హర్షిత్, అండర్ 14 బాయ్స్ లో నక్కదాసరి రిత్వేష్, పులవేణి మహిధర్, లింగాల నిశితార్ధ్, ముక్కెర సిద్దు, తుమ్మల నిక్షిత్, అండర్ 17, 14 గర్ల్స్ చెస్ విభాగంలో ఉమ్మె కుల్సుం, ఎలిపెద్ది అక్షర అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని, ఎస్ జి ఎఫ్ మండల కన్వీనర్ పీడీ కె. రాజగోపాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విస్డం హైస్కూల్ కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజురెడ్డి, డైరెక్టర్ నివేదిత రెడ్డి, పి ఈ టి లు రవిశ్ రెడ్డి, సునీత ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

## మంత్రి సీతక్క సభకు కాంగ్రెస్ శ్రేణుల తరలింపు..

### బడా భీంగల్ నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు



**భీంగల్ , సెప్టెంబర్ 15,(నవగీతం)** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండలం బడా భీమ్గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన పంచాయతీరాజ్ శాఖ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ రాగుల మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా నినాదాలు చేస్తూ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు మొహమ్మద్ జుబేర్, లింబాద్రి, దండు మహేష్, ముల్కా అరుణ్, రాగుల కిషన్, ఆకుల రవి, నేల రాజన్న, జంగం ప్రభు, రేషన్ శంకర్, హరీష్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహ్రెయిన్ లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### పద్మశాలి సమాజ్ ఆధ్వర్యంలో గణనాథుడి ప్రతిష్ట
### విశేష సంఖ్యలో పాల్గొన్న తెలంగాణ వలసదారులు



**?కోరుట్ల, సెప్టెంబరు 15.(నవగీతం)** ఉపాధి కోసం గల్ఫ్ దేశమైన బహ్రెయిన్ వెళ్లిన జగిత్యాల జిల్లా కోరుట్లతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన హిందువులు, పద్మశాలి సమాజ సభ్యులు వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.బహ్రెయిన్‌లోని పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిష్టాపన మహోత్సవంలో వలస కార్మికులు, పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.?ఈ వేడుకల్లో కోరుట్ల పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు జక్కుల ప్రసాద్-లలిత దంపతులు, సాయి కిరణ్ కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.గణపతికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు, మంగళ హారతులు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.?ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ... స్వదేశానికి, సొంత ఊళ్లకు సుదూర ప్రాంతంలో ఉన్నప్పటికీ మన సంస్కృతీ సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకోవాలనే తపనతో అందరూ ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. బహ్రెయిన్‌లో స్థిరపడిన కోరుట్ల పట్టణ ప్రజలతో పాటు తెలంగాణలోని వివిధ గ్రామాల హిందూ సోదరులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## కొండగట్టు ఘాట్ రోడ్డు విస్తరణకు శ్రీకారం..

### ఎంత ఖర్చయినా వెనకాడేది లేదు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**?కొడిమ్యాల సెప్టెంబర్ 15. (నవగీతం)**జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.దేవస్థానం, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తుల మనోభావాలు, వాస్తు, ప్రమాదాల నివారణను దృష్టిలో ఉంచుకుని నూతన డిజైన్ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దొంగలమర్రి నుంచి వై-జంక్షన్ వరకు ఆలయ దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం రహదారి విస్తరణకు రూ. 100 కోట్లు లేదా రూ. 200 కోట్లు ఎంత వ్యయమైనా ప్రభుత్వం వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిల ఆదేశాలతో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, 4-5 రోజుల్లో నివేదిక అందజేస్తారని తెలిపారు.?అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతంలో శంకుస్థాపన చేసిన రూ. 35.19 కోట్ల టీటీడీ నిధుల పనులకు రెండు-మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కొండగట్టు ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్న ఆయన.. కొండగట్టును రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

